# పాపం గోపాలం

"ఏమండీ నాకు జీవితంలో ఒక తీరని కోరిక ఉండిపోయిందండీ. అది మీరు తీర్చాలి" అంది తార గోపాలం భుజం మీద జరీ కండువా కొసని తన చేతివేలికి చుట్టుకుంటూ. అయితే ఇలాంటి సమయంలో భార్యలు భర్తల చొక్కా బొత్తాలు గిరగిరా తిప్పాలి కాని ప్రస్తుతం మొదటి రాత్రి కాబట్టి అతనికి చొక్కా లేదు.

"అది కాదే ఇది మొదటి రాత్రి కదా. తీరని కోరికలూ, జీవితంలో జరిగిన భయంకరమైన సంఘటనలూ ఇలాంటివి కాదే చెప్పుకోడం. ఈ రాత్రిని మరచిపోలేని రాత్రిగా చేసుకోవాలి భార్యాభర్తలు" అన్నాడు గోపాలం.

గోపాలానికి పెళ్ళయి వారం రోజులయింది. పెళ్ళికి ముందే తారను చూసి మైమరచి పోయిన అతను, ఆమెతో షికార్లు, సినిమాలు, సాయంకాలాల్లో గోదావరిలో పడవ విహారం లాంటి కార్యక్రమాలన్నీ కానిచ్చేశాడు. 'శోభనం రోజున ఒడిలో పడుకుని ఇదేమిటి ఇలా మాట్లాడుతూంది, ఏదో చనువిచ్చేనుకదాని ముందరికాళ్ళకు బంధం వేస్తూందా. దీని తీరని కోరిక తీర్చకపోతే మరి పస్తులు ఉండాలేమో'. ఇలాంటి ఆందోళనకరమైన ప్రశ్నలు గోపాలం బుర్రని తొలిచేస్తున్నాయి. 'మొదటి రాత్రి మధురమైన రాత్రి అంటారు కదా, ఇదేమిటి' అనుకుంటున్నాడు పాపం గోపాలం.

తార అమ్మమ్మేమో "పిచ్చికొయ్యా, గదిలోకి వెళ్ళగానే ఒళ్ళో వాలిపోయి, మొగుడేం చెబితే అది వినేసి, అతను ఎలా ఉండమంటే అలా ఉండిపోయేవనుకో, నీ జన్మ అంతా వెట్టిచాకిరీనే. అలా కాకుండా కొంచెం బెట్టుగా ఉండి లేనిపోని అతి సిగ్గులు నటించి నీ కోరికల లిస్టు అతని ముందు పెట్టాలి. అతను నీ కోరికలన్నీ తీరుస్తానని హామీ ఇచ్చాకే అతను చెప్పినట్లు వినాలి. లేదనుకో తలనెప్పిగా ఉందని అటు ప్రక్కకు తిరిగి పడుకో, ఆడాళ్ళకు తలనొప్పి అనే అద్భుతమైన ఆయుధం దేవుడు పెట్టాడే పిచ్చమ్మా. అస్సలు డాక్టర్లు కూడా ఈ తలనెప్పి నిజంగా ఉందా లేదా అనేది కనుక్కోలేరే తల్లీ" అంటూ నిన్న రాత్రంతా హితబోధ చేసింది.

తార బాగా ఆలోచించింది. ఇదీ బాగానే ఉంది అనుకుంది. ఆ ప్రణాళిక ఇప్పుడు అమలు చేస్తూందన్నమాట.

"అదికాదండీ మనం తొలిరాత్రే మనసు విప్పి మాట్లాడుకుంటే ఎంతో సంతోషంగా ఉంటుంది కదండీ. అందుకని అలా అన్నాను. మీకు కోపం వచ్చిందా.

అవునూ మీకూ ఏమైనా తీరని కోరికలున్నాయా?" అంది. 'నీ పెళ్ళి చూపుల్లో కోరికలు పుట్టాయి కాని ఇప్పుడు ఊబిలోకి దిగాను కదా ఇంకేం కోరికలుంటాయి' అనుకున్నాడు గోపాలం తనలో తాను. "అదేంటండీ ఏమీ చెప్పరు?" అంది అతని ఛాతీమీద వెంట్రుకలలో వేళ్ళు పెట్టి గిరగిరా తిప్పుతూ.

గోపాలానికి అసలే కితకితలు, ఒక వేళ దీని కోరిక తీర్చలేనిదైతేనో...! "అమ్మో" అనుకుంటూ, "ఈ రోజు నుండి నీకు నేను, నాకు నువ్వే కదా. మన కష్టాలు, సుఖాలు, కోరికలూ అన్నీ మనిద్దరికే పరిమితం. చెప్పు, నీ కోరికేమిటి?" అన్నాడు. గురుడు లైనులోకి వచ్చాడనుకుంది తార.

"మీకు సెల్‌ఫోను ఉంది కదా"

"ఇంతవరకూ నాకు ఒకటి ఉందనుకో, నువ్వు కాపురానికి వచ్చేక నీ కోసం పనికివస్తుందని మరోటి కొన్నాను" అన్నాడు. "మా మంచివారు మా శ్రీవారు" అని అతని అరచేతిని ముద్దాడింది తార. ఐసయిపోయాడు గోపాలం.

"ఎలాగూ నాకు ఒక సెల్ కొన్నారు కాబట్టి, మరో నాలుగైదు సెల్‌ఫోన్లు కొనండి. అన్ని కంపెనీల కనెక్షన్లు పెట్టించండి. మీరు రోజూ ఆఫీసుకు వెళ్ళిపోయాక, నేను ఎంచక్కా టెలివిజన్‌లో అన్ని ఛానెల్స్‌కీ ఫోన్లు చేసి మన సెల్ నెంబరూ, అడ్రసూ చెప్పేసి ఛానల్స్‌లో వచ్చే 'స్వర్ణజల్లు, రజితసునామీ, బంగారం సింధూరం, ముట్టుకుంటే పట్టుచీర, చీరనెత్తుకోవే చిన్నదానా' లాంటి ఎన్నో కార్యక్రమాలలో సెల్‌ఫోన్స్ సహాయంతో పాల్గొని బహుమతులు గెలిచేసుకుంటాను. మా నాన్నగార్కి సెల్‌ఫోన్ అంటే పరమచిరాకండీ బాబూ. ఎక్కడైనా సెల్‌ఫోన్ రింగ్ వినిపిస్తే చాలు పూనకం వచ్చినట్లుగా అరిచేవారండీ బాబూ. సెల్ అనేది మా ఇంట్లో ఉండడానికి వీలులేదనేవారు" అంటూ చెబుతున్న ఆమె ముఖం నిండా ఆనందం పులుముకోవడంతో సెల్‌ఫోన్‌లో రంగుల స్క్రీన్‌లా తయారైంది ముఖం.

తార మరీ పొట్టీ, పొడుగూ కాకుండా స్లిమ్‌గా, తెల్లగా ఉంటుంది. కోటేరులాంటి ముక్కు చక్రాల్లాంటి కళ్ళు, బుల్లిబుగ్గలు, చిన్నినోరు, అచ్చంబాపూ బొమ్మలా ఉంటుంది. పెళ్ళి చూపుల్లో చక్రాల్లాంటి కళ్ళు పెద్దవి చేవి చికిలించి చిన్నగా నవ్వింది. అంతే! గోపాలం ఆ బౌన్సర్‌కి సెంచరీకి దగ్గరగా ఉన్న బ్యాట్స్‌మెన్‌లా క్లీన్‌బౌల్డ్ అయిపోయాడు.

'రోటిలో తలపెట్టేక రోకటిపోట్లకు భయపడనేల, పులినోట్లో తలపెట్టేక చావు కోసం వెరవనేల' వంటి సామెతలు చాలా గుర్తుకు వచ్చాయి గోపాలానికి. ఆ సమయంలో తప్పేదేముంది? "ఓస్ ఇంతేనా. తీరని కోరికలంటే ఎంత డబ్బు ఖర్చవుతుందోనని భయపడ్డాను. అలాగే నీకు ఎన్ని సెల్‌ఫోన్లు కావాలంటే అన్ని కొంటాను. దేశంలో ఉన్న అన్ని కంపెనీల కనెక్షన్లు తీసుకుందాం, సరేనా? నేను ఆఫీసుకు వెళ్ళేక నీకు తోచదు కదా, ఏదో వ్యాపకం ఉండాలిలే" అన్నాడు.

-000-

అంతే! ఆ తొలిరాత్రి గోపాలాన్ని అందని తీరాలకు తీసుకువెళ్ళిపోయింది తార. తెల్లవారేక గుమ్మం దగ్గరే గోపాలం అమ్మమ్మ, తార అమ్మమ్మ కాచుకుని కూర్చున్నారు తలుపు తీయగానే తారని "ఏమే పిచ్చిపిల్లా, సంవత్సరం తిరక్కుండా నాకు మునిమనవణ్ణి ఇవ్వాలి, తెలిసిందా? నాకు ఆడుకోడానికి పండంటి బాబు కావాలి" అన్నారు ఇద్దరూ ఒకేసారి తారతో. "అలాగే" అని వినీవినపడనట్లుగా అనేసి సిగ్గుతో పరుగెత్తింది తార.

కొంచెం సేపటికి గోపాలం బయటికి వచ్చాడు. అతని అమ్మమ్మ "ఒరేయ్ పిచ్చినాగన్నా. సంవత్సరం తిరక్కుండా నాకు మునిమనవణ్ణి చూపించాలిరోయ్, చూసెళ్ళిపోతానురా, దేముడు ఎప్పుడు పిలుస్తాడో ఏమో" అంది. "దానిదేముంది, ఈలోగా ఒక బార్బీబొమ్మ కొనిస్తాను, దానితో ఆడుకో, ఆకస్మాత్తుగా దేముడు పిలిచినా గొడవుండదు" అన్నాడు తాపీగా.

"పిల్లోడు సరసుడే" అంది తార అమ్మమ్మ. వాళ్ళిద్దరూ నవ్వుకుంటూనే ఉన్నారు.

-000-

కొత్తకాపురం. తార తన కోసం ప్రత్యేకంగా ఒక గది పెట్టుకుంది. ఆ గదిలో కలర్ టి.వి, ప్రక్కనే సెల్‌ఫోన్లు, లేండ్ ఫోను, నోటుపుస్తకం వగైరాలు పెట్టుకుంది.

"తారా నేను ఆఫీసుకు వెళ్తున్నాను" అంటూ తార దగ్గరకు వచ్చాడు గోపాలం. "చూడండి, నేను కొన్ని బహుమతులు ఇచ్చే కార్యక్రమాలకు నా పేరు, మరికొన్ని ప్రోగ్రామ్స్‌కి మీ పేరు రిజిస్టర్ చేస్తున్నాను. ఉదయం పది గంటల వరకూ మీరో నేనో, ఆ తరువాత సాయంత్రం వరకూ నేనూ, మీరు ఆఫీసు నుండి వచ్చేక రాత్రి పడుకునే వరకూ మనం ఇద్దరమూ టి.వి. దగ్గర కూర్చుని సెల్‌ఫోన్స్, లేండ్ ఫోన్ దగ్గరే ఉండాలి. ఏ క్షణంలో ఏ ప్రోగ్రామ్ నుండి మనకు ఫోన్ వస్తుందో తెలియదు కదా, ఫోన్ వచ్చినప్పుడు మనం దగ్గర లేమనుకోండి బహుమతి కాస్తా పోతుంది".

"అలాగే, అప్పుడు మనం ఏం చేయాలి?" అన్నాడు గోపాలం. "ఫోన్ ఎత్తేక వాళ్ళు అడిగే ప్రశ్నలకు చకచకా జవాబులు చెప్పాలి. లేదా వాళ్ళు ఏం అడిగితే అది చెప్పాలి. సరియైన జవాబులు చెబితే బహుమతులు ఇస్తారు" అంది. "సరే నువ్వు సాయంత్రం దాకా ఫోన్ దగ్గరే ఉండు" అని తల కొట్టుకుంటూ వెళ్ళిపోయాడు గోపాలం.

ఏదో చాలా రోజులకు అందమైన అమ్మాయితో పెళ్ళి అయిందనుకుంటే, దీనికి ఈ మాయదారి పిచ్చి ఏమిటో అర్థం కావడం లేదు. ఇరవై నాలుగు గంటలూ ఆ ప్రోగ్రాముల విషయాలేగాని, పెళ్ళయి నెలయింది, ఓ సరసం లేదూ పాడూ లేదు. పగలంతా ఫోన్ల కోసం ఎదురు చూసి, ఎదురు చూసి టి.వి. ఛానల్స్‌కు రిజిస్ట్రేషన్ కోసం ఫోన్లు ట్రై చేసి అలిసిపోయానని రాత్రి బెడ్‌రూమ్‌లో చేరడం, ముడుచుకుని

నిద్రపోవడం. తన కొత్త సంసారం ఇలా అయిందేమిటని ఆలోచించుకుంటూ బాధపడడం ఇదీ తంతు.

ఒక రోజునైతే ఈ ఆలోచనలతో కొత్త మోటర్ బైక్ మీద వెళ్తూ ఎదురుగా వస్తున్న కారుకు దాష్ ఇవ్వబోయాడు. ఆ కారు డ్రైవరు 'ఇంటి దగ్గర చెప్పే వచ్చావా బాబూ?' అని అడిగేవరకూ తను మోటర్‌బైక్ మీద ఉన్న సంగతి తెలియనే లేదు. కారు డ్రైవరు ఆ రోజున ఎలర్ట్‌గా ఉండి ఉండకపోతే తన పని గోవిందా!

ఆ రోజు సాయంత్రం నాలుగు మూరల మల్లెలు, విరజాజులు, స్వీట్స్ ప్యాకెట్ తీసుకుని వచ్చాడు గోపాలం చాలా హుషారుగా, కొత్త పెళ్ళాంతో ఆ రోజు ఎలాగైనా ఎంజాయ్ చెయ్యాలని. కానీ – తార తన గదిలో సెల్‌ఫోన్లు ముందు పెట్టుకుని టెలివిజన్‌లో వచ్చే ఒక కార్యక్రమం కళ్ళప్పగించి అదేపనిగా చూస్తోంది.

"ఇప్పుడు ప్రేక్షకులందరూ చెవులు రిక్కించుకుని వినండి. మీరు అన్నం తింటున్నాసరే, ఏ పని చేస్తున్నాసరే. ఆ పని వెంటనే ఆపివేసి ఫోన్ దగ్గరే ఉండండి. ఇదిగో నేను ఫోన్ చేస్తున్నాను. నేను ఫోన్ చేసినప్పుడు మీరు మా ప్రోగ్రాం చూస్తూ ఉండి, ఫోన్ దగ్గరే ఉండి ఫోన్ ఎత్తకపోతే లైను కట్ అయిపోతుంది. అందువలన మీరు బంగారం లాంటి అవకాశం పోగొట్టుకుంటారు" అంటూ టెలివిజన్ యాంకర్ తన పళ్ళన్నీ కనిపించేట్లుగా రాని నవ్వు బలవంతంగా తెచ్చుకుని అరుస్తోంది.

సరిగ్గా అదే సమయంలో సీన్‌లో ఎంటరయ్యాడు గోపాలం. ఆ యాంకర్ ఎదురుగా ఉండి ఉంటే ముక్కు మీద ఓ గుద్దు గుద్ది 'నీకు సంసారం ఉందా లేదా' అని గదమాయించాలనిపించింది అతనికి.

"తారా డియర్, ఈ రోజు మన ప్రోగ్రాం ఏమిటో తెలుసా. సినిమాకు వెళ్ళడం, ఫైవ్‌స్టార్ హోటల్‌లో భోజనం, అక్కడే ఏ.సి.రూమ్‌లో రాత్రి పడుకోవడం. తెల్లవారి ఇంటికి వచ్చేయడం" అంటూ వెనుకనుండి ఆమె భుజంపై చేయి వేసి ఆమె ముఖం దగ్గరకు తీసుకోబోయేడు. అంతే! ఆమె విసురుగా... "అబ్బ ఊరుకోండి. పగలూ రాత్రీ అదే ధ్యాస. అవతల ప్రోగ్రాం వస్తోంది. ఒక వేళ మనకు వాళ్ళు ఫోన్ చేస్తే మీ గొడవలో పడి ఫోన్ ఎత్తలేదనుకోండి, బహుమతులు గోవిందా!" అంటూ విదిలించుకుంది.

ఈ టి.వి. కనిపెట్టిన వాడు గనుక తన ఎదురుగా ఒక్కసారి కనిపిస్తే వాడిని కసాబిసా కసితీరా లక్ష కత్తిపోట్లు పొడవాలనిపించి గోపాలం పళ్ళు కొరుక్కున్నాడు. దారి పొడుగునా మత్తెక్కించే ఆలోచనలతో వేగిపోయి వచ్చిన గోపాలానికి, తార చీదరించుకోవడంతో కణకణలాడే నిప్పుల మీద నీళ్ళు జల్లినట్లైంది. గోపాలం తనను

తాను కంట్రోల్ చేసుకోలేకపోయాడు. వెంటనే టపటపామని తన రెండు చెంపలూ వాయించేసుకున్నాడు. పెద్ద శబ్దం అయింది కూడా. ఎందుకంటే స్త్రీలను కొట్టేవాళ్ళంటే అతనికి పరమ అసహ్యం. అందుకని తారను ఒక్కటిచ్చు కోవాలనిపించి తనను తాను కొట్టుకున్నాడన్నమాట.

ఈ సీను చూసిన తార భయంతో చిన్నబుచ్చుకుని "ఏమిటలా చేశారు? నా మీద కోపం వచ్చిందా? నాకు టెలివిజన్ ఛానల్స్‌లో వచ్చే ప్రోగ్రామ్స్‌లో ఒక కిలో బంగారం, పదికిలోల వెండి, ఒక మారుతీ కారు వచ్చేవరకే, మనకు ఈ కష్టాలు. అవి వచ్చేసేయనుకోండి. ఇక టీ.వీ, సెల్‌ఫోన్లు వగైరాలన్నీ తీసి పారేసి మనం మన బెడ్‌రూమ్ వదిలే ప్రసక్తే లేదు" అంది బుంగ మూతితో.

ఆ బహుమతులన్నీ గెలిచేసుకున్నంత సంబరంతో వెలిగిపోతున్న తార ముఖం చూసి గోపాలానికి ఈ సారి తన తల గోడకేసి బాదుకోవాలనిపించింది. కాని అప్పటికే రెండు చెంపలూ ఎఱ్ఱగా కందిపోయి ఉండడంతో ప్రస్తుతానికి ఆ ప్రోగ్రాం వాయిదా వేసుకున్నాడు. అయినా సరే – తనలో ఉన్న నిస్సత్తువ అంతా తొలగించుకుని కొద్ది క్షణాల్లో. ఉరితీయబడే వ్యక్తి తన చివరి కోరిక అడిగే లాగా, దీనమైన ముఖంతో – "తారా డియర్, నువ్వు చెప్పినవన్నీ మనం టెలివిజన్ ఛానల్స్‌లో గెలవాలంటే అసలు ఏం చేయాలో చెబుతావా?" అన్నాడు గోపాలం లోగొంతుతో.

అప్పుడు తార ముఖం నూరు కేండిల్ బల్బ్ హైవోల్టేజి కరెంట్ వచ్చినప్పుడు రెండు వందల కేండిల్ బల్బ్‌లా వెలిగిపోయింది. వెంటనే సంతోషం, సంబరం నిండిన ముఖారవిందంతో – "అదీ సంగతి. ఇప్పుడు మీరు లైనులోకి వచ్చారు. చెబుతా వినండి శ్రద్ధగా – 'కామినీ' టి.వి.లో వాళ్ళు మనకు ఫోన్ చేసినప్పుడు, వాళ్ళు వేసే ప్రశ్నలకు జవాబు చెప్పామే అనుకోండి 'స్వర్ణజల్లు' కార్యక్రమంలో మనకు కిలోబంగారం వస్తుంది. కిలో బంగారం మనం జన్మలో కొనగలమా చెప్పండి మరి? 'ఖుషీ' టి.వీలో వాళ్ళకి మనం ఫోన్ చేసినప్పుడు వాళ్ళు ఫోన్ ఎత్తారనుకోండి, వెంటనే మనకి పది కేజీల వెండి గెలుచుకోడానికి 'రజిత సునామీ' కార్యక్రమంలో పాల్గొనడానికి లెటర్ పంపిస్తారు. ఆ ప్రోగ్రాంకి మనం వెళ్తే అక్కడ సింపుల్ ప్రశ్నలకు జవాబులు టకటకా చెప్పేస్తే పది కిలోల వెండి సముద్రంలో సునామీలా పొర్లిపొర్లి మనింటికి వస్తుంది. 'ఓహో టి.వి.'లో వాళ్ళు ఫోన్ చేసినప్పుడు వెంటనే మనం హలో అనకుండా 'ఓహో ఓహో ఓహో' అని మూడు సార్లు అంటే మన పేరు, అడ్రసు నోట్ చేసుకుంటారు. ఇలా నోట్ చేసుకున్న పేర్లన్నీ డ్రా తీసి డ్రాలో గెలిచిన అదృష్టవంతులు ముగ్గురికి మూడు మారుతీ కార్లు ఇస్తారు.

ఇలాగే పట్టిందల్లా బంగారం, ముట్టుకుంటే పట్టుచీర, చీరలెత్తుకో పిల్లా, త్వరపడండి, ఊరికే దొబ్బేయండి, యాహూ బేగ్ నొక్కేయండి, రోజంతా టి.వీ చూడండి పేరు చెప్పండి కాసులపేరు గెలవండి - లాంటి కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి. అన్నీ ఎందుకని ముందుగా నేను సింపుల్‌గా బంగారం. వెండి, మారుతీ కారు కార్యక్రమాలు ఎన్నుకున్నాను, ఇవి అయ్యాక కొంత కాలం గ్యాప్ ఇచ్చి మిగతా కార్యక్రమాలలో కూడా ఎలాగైనా సరే బహుమతులు గెలుస్తానుకోండి" అంటున్న తారను చూస్తోంటే, ఈ సారి మాత్రం గోపాలానికి క్రిందపడి గిలగిలా కొట్టుకోవాలనిపించింది.

గోపాలం తల మీద రెండు చేతులూ పెట్టుకుని 'హతవిధీ ఈ ప్రోగ్రామ్స్ కనిపెట్టిన వాడు కనుపిస్తే డబుల్‌బేరల్ గన్‌తో వాడి ఒళ్ళంతా తూట్లు పొడిచేసేవాడిని' అనుకున్నాడు పళ్ళు పటపటా కొరుక్కుంటూ. ఈ పిచ్చిపెళ్ళాంతో ఎలా వేగాలో అనుకున్నాడు. తార వైపు కోపం, ఆశ్చర్యం, విచారం, కలగలిపి చూస్తూ నోరు తెరచి అదే పనిగా ఆమెను చూస్తున్న గోపాలం నోట్లోంచి దోమలు రాకపోకలు సాగిస్తున్నాయి యధేచ్ఛగా.

"అదేంటండీ అలా నోరు తెరుచుకుని ఉండిపోయారు? ఖర్మగాలి...' అంటూ గోపాలాన్ని ఎత్తి కుర్చీలో కుదేసి అతని గుండెలమీద పిడికిళ్ళతో శక్తికొద్దీ కొట్టడం మొదలు పెట్టింది. వెంటనే గోపాలం బాధతో "అమ్మో ఇదేమిటే" అన్నాడు.

"మా మామ్మ చెప్పింది లెండి. హఠాత్తుగా మగాళ్ళు కోపంతో గాని, సంతోషంతో గాని నోరు తెరుచుకుని ఉండిపోతే అది గుండెనొప్పి వచ్చినట్లే, అప్పుడు వెంటనే గుండెల మీద పిడిగుద్దులు గుద్దితే మరల గుండె కొట్టుకంటుందని, మరల గుండె కొట్టుకోవడం మొదలు పెట్టి మనిషి బ్రతుకుతాడనీ, ఈ లోగా డాక్టర్ వచ్చేస్తారనీ. అమ్మయ్య! మీకేం కాలేదు" అంటూ - "వెళ్ళి కాసిని మంచినీళ్ళు తాగి రండి. ఇక్కడ ఫోన్లు మిస్ అయిపోతాయి. మంచివారు కదూ మీరు" అంటున్న తారను అదోలా చూస్తున్నాడు గోపాలం.

తన అమ్మమ్మ కోరుకున్న మునిమనవడు ముందా? తన ముద్దుల భార్య ముచ్చటపడుతున్న విలువైన బహుమతులు ముందా? ఇవన్నీ భరించలేక తనకు వచ్చే గుండెనొప్పి ముందా? అనేవి గోపాలాన్ని పట్టి పీడిస్తున్న భేతాళ ప్రశ్నలు - పాపం గోపాలం! ●

**(ఆంధ్రభూమి, మంత్లీ, జూన్ 2011)**